# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 120 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 29 మార్చి 2026 | పేజీలు : 4




## బెట్టింగ్ ఊబిలో పడొద్దు

- హైదరాబాద్ సీపీ సజ్జనార్

3లో



## చిన్నారులకు తొలిముద్ద

- నూతన పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

2





| (EMI Schedule) 100 Sq.yards @ 4599/- | | |
|---|---|---|
| Plot Enrolment | 20,000 | - |
| Plot Booking | 1,00,000 | 7 Days |
| Plot Allotment | 1,30,000 | 15 Days |
| 30 Months EMI x 7000 | 2,10,000 | 30 Months |
| Total Amount | 4,60,000 | |

# చిన్నారులకు పౌష్టికాహారం

- తొలిముద్ద పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ
- అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత



**హైదరాబాద్, మన చౌరాస్తా :** దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.







## ప్రాణాంతక రక్తనాళ వ్యాధికి

# సక్సెస్ ఫుల్ ట్రీట్మెంట్

- మలక్‌పేట్ యశోదా ఆసుపత్రి వైద్యబృందం ప్రతిభ
- రక్తనాళాల సమస్యలపై అవగాహన అవసరం
- డాక్టర్ రంజిత్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రాణాలకు ముప్పుగా మారే అరుదైన రక్తనాళ వ్యాధిని సమయానికి గుర్తించి విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ఓ మహిళ ప్రాణాలను యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు కాపాడారు. 52 ఏళ్ల మహిళకు ఇన్‌ఫ్రారెనల్ అబ్డామినల్ ఆఒర్టిక్ అన్యూరిజం అనే ప్రమాదకర వ్యాధి నిర్ధారణ అయింది. ఈ వ్యాధిలో ప్రధాన రక్తనాళం బలహీనమై ఎప్పుడైనా పగిలే ప్రమాదం ఉండటంతో పరిస్థితి అత్యంత విషమంగా మారింది. పొట్ట నొప్పి వెన్నుపూస వరకు వ్యాపించడం వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన రోగిని వైద్యులు సమగ్రంగా పరీక్షించి సమస్యను తొందరగా గుర్తించారు. డా. రంజిత్ కుమార్ ఆనందను ఆధ్వర్యంలో ఆఒర్టోఇలియాక్ బైపాస్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. అనంతరం ఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి హైపోవోలెమిక్ షాక్, కిడ్నీ సమస్యలు, రక్తహీనత వంటి సమస్యలను సమర్థవంతంగా నియంత్రించారు. క్రమంగా రోగి ఆరోగ్యం మెరుగుపడి సాధారణ స్థితికి చేరుకోవడంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఈ మేరకు శనివారం జనగామలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్లు రంజిత్ కుమార్, లక్షన్ సుంఘా మాట్లాడుతూ "ఇలాంటి రక్తనాళ వ్యాధులను సమయానికి గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు" అని తెలిపారు. యశోదా ఆసుపత్రి యాజమాన్యం తెలిపిన ప్రకారం, అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం, సమన్వయంతో కూడిన చికిత్స విధానాల వల్ల ఇలాంటి క్లిష్ట కేసులను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఇలాంటి వ్యాధుల పై అవగాహన కల్పించాలని అన్నారు.

# పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. శనివారం, జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) మండల పరిధిలో గల జెడ్పీఎస్ఎస్, అలాగే అదే మండలంలోని ఛాగల్ గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు. పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, ఇతర మౌలిక వసతులు, ఆరోగ్య శిబిరం వంటి వాటి గురించి ఆరా తీశారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలని, పరీక్ష పూర్తైన వెంటనే జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







# స్కూల్ ప్రహరీకి భూమి పూజ

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు పాలకుర్తి మండలంలోని తొర్రూరు (జె) గ్రామంలోని రూ.22 లక్షల ఈజీఎస్ నిధులతో హై స్కూల్ ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) కు ఉప సర్పంచ్ గోనె కిరణ్ భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి, పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్, అనుముల మల్లారెడ్డి, హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మౌనిక, పిఎసిఎస్ మాజీ చైర్మన్ గోనే నైస్ రెడ్డి, రాష్ట్ర ఓ బి సి కార్యదర్శి పులి గణేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కనకరాజు, చిలువేరి బాలరాజు, గోనె దామోదర్ రెడ్డి పిఎసిఎస్ మాజీ చైర్మన్, వార్డ్ మెంబర్లు పోగు రాములు, కత్తుల నబితా నాగరాజు, పసులాది వెంకన్న, గోనె సుశీల, ఎల్లయ్య, చిలువేరి సంపత్, కె. ప్రభాకర్, పి అబ్బయ్య మాజీ సర్పంచ్, గోనె మహేందర్, ఇంతలా మధు, గోన సోమయ్య, గుర్రం రామచంద్రు, పి కొమురయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



### వరంగల్ పోలీస్ రేంజ్ కార్యాలయ

# నూతన భవనం ప్రారంభం

**హనుమకొండ, మన చౌరాస్తా :** నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ పోలీస్ రేంజ్ పరిపాలన కార్యాలయ భవనాన్ని శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్లో ఏర్పాటు చేసిన నూతన వరంగల్ పోలీస్ రేంజ్ కార్యాలయంలో రేంజ్ పోలీస్ అధికారులకు సంబంధించిన శాఖ పరమైన పరిపాలన కార్యకలాపాలు ఈ భవనం నుండి కొనసాగుతున్నాయి. పోలీస్ అధికారుల శాఖపరమైన సమస్యలపై రేంజ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని, పనితీరులో పారదర్శకంగా, పరిపాలన బాధ్యతాయుతమైన పనితీరు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు దార కవిత, అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, రేంజ్ కార్యాలయం సూపరింటెండెంట్ యుగేందర్, ఏసీపీలు సత్యనారాయణ, నర్సింహా రావు, సురేంద్ర పాల్గొన్నారు.



### యువత బెట్టింగ్

# ఊబిలో పడొద్దు..

- హైదరాబాద్ సీపీ సజ్జనార్

**హైదరాబాద్, మన చౌరాస్తా :** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్యప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్`2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.



# నడిరోడ్డుపై కారు దగ్ధం

**యాదాద్రి, మన చౌరాస్తా :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పరిధిలో ఓ కంపెనీ సమీపంలో కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. ఓ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రయాణం మధ్యలోనే కారులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. వెంటనే వాహనం నుంచి బయటకు దిగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటలు వేగంగా వ్యాపించడంతో కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది.

### ముల్కనూరులో ఘనంగా దేవాలయ

# ప్రతిష్ఠ మహోత్సవాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భారీ స్థాయిలో ధార్మిక కార్యక్రమాలకు గ్రామస్తులు విస్తృత సన్నాహాలు చేస్తున్నారు. గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు బలిజమేడలమ్మ, గొల్లకేతమ్మ దేవతల విగ్రహాలు, శివలింగం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ రాధాకృష్ణ స్వామి, అభయాంజనేయ స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభం మరియు నవగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలు 2026 మే 1వ తేదీ శుక్రవారం నుంచి మే 3వ తేదీ ఆదివారం వరకు జరగనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమాల్లో భాగంగా మే 3వ తేదీ ఉదయం 8 గంటల 14 నిమిషాలకు వృషభ లగ్న సుముహూర్తంలో ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడుతుంది. ఈ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేదమూర్తులు, బ్రాహ్మణులు సంప్రదాయ విధానంలో నిర్వహించనుండగా, గ్రామ పెద్దలు మరియు యాదవ కులస్తుల సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మహోత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు.




### గ్యాస్ బుకింగ్ పేరిట

# ఆన్‌లైన్ మోసాలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- డీసీపీ రాజమహేంద్రనాయక్



**జనగామ, మన చౌరాస్తా :** ఇటీవల ఎల్‌పీజీ (LPG) గ్యాస్ సిలిండర్ బుకింగ్ పేరుతో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు మరియు పౌర సరఫరాల శాఖతో పాటు జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. 'మీ ఫోన్‌కు వచ్చే OTP, బ్యాంక్ PIN లేదా ఇతర వ్యక్తిగత వివరాలను గుర్తు తెలియని వ్యక్తులతో ఎప్పుడూ పంచుకోకండి. మీ గ్యాస్ కనెక్షన్ ఆగిపోతుంది, KYC అప్‌డేట్ చేయాలి అంటూ వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్‌ను నమ్మకండి. వాట్సాప్ లేదా SMS ద్వారా వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దు. గుర్తు తెలియని APK ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకుండా ఉండండి. అనధికారిక లింకుల ద్వారా గ్యాస్ బుకింగ్ కోసం డబ్బులు చెల్లించవద్దు. గ్యాస్ సిలిండర్ బుకింగ్ కోసం కేవలం అధికారిక వెబ్‌సైట్లు లేదా అధికారిక మొబైల్ యాప్‌లను మాత్రమే ఉపయోగించండి. ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా మీ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించండి..' అని డీసీపీ సూచించారు. మీరు మోసాలకు బాధితులైతే లేదా అనుమానాస్పద కాల్స్ వచ్చినట్లయితే వెంటనే 1967 లేదా 100 నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.




# బరిలో..

## అన్న హీరో.. చెల్లి నిర్మాత...

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**